3న కుప్పంకు రాష్ట్ర ప్రెస్ అకాడమి చైర్మన్ రాక

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్: ఆగస్టు 3న కుప్పంకు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రెస్ అకాడమీ చైర్మన్ కొమ్మినేని శ్రీనివాసరావు వస్తున్నారని జిల్లా కలెక్టర్ సగిలి షన్మోహన్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆగస్టు 3వ తేదీన ఉదయం 10.30 గంటలకు కుప్పం ఆర్అండ్బి అతిథి గహం చేరుకుంటారు. అనంతరం కుప్పం పట్టణంలోని స్థానిక విలేకరులతో కలసి పర్యటిస్తారు. రాత్రికి కుప్పంలో బసవ చేసి 4వ తేదీ ఉదయం శ్రీ సత్యసాయి పుట్టపర్తి జిల్లాకు బయలుదేరి వాళ్ళతారని కలెక్టర్ ఆ ప్రకటనలో తెలిపారు.

కడప ఉక్కు పరిశ్రమను ప్రభుత్వమే నిర్మించాలి

రాయలసీమ జిల్లాల అభివృద్ధికి ప్రత్యేక నిధులు ఇవ్వాలి

కలెక్టరేట్ ఎదుట సిపిఎం ధర్నా

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్: కడప ఉక్కుపరిశ్రమ లాభదాయకం కాదని కేంద్ర హోంశాఖ సహాయమంత్రి పార్లమెంట్లో రాతపూర్వకంగా చెప్పడాన్ని నిరసిస్తూ సోమవారం కలెక్టరేట్ వద్ద సిపిఎం ఆధ్వర్యంలో ధర్నా చేయడం జరిగింది. ఈసందర్భంగా సిపిఎం జిల్లా కార్యదర్శి వాడ గంగరాజు మాట్లాడుతూ కడప ఉక్కు పరిశ్రమ స్థాపించడం సాధ్యం కాదని బిజెపి ప్రభుత్వం నిస్సిగ్గుగా ప్రకటించడం సిగ్గుచేటు అని అన్నారు. ప్రభుత్వరంగంలో లాభదాయకం కానీ ఈ ఉక్కు పరిశ్రమ ప్రైవేటు జిందాల్ కంపెనీకి ఎలా లాభదాయకమవుతుందో బిజెపి చెప్పాలని ప్రశ్నించారు. సెయిల్ అధ్యయనం చాటున తన చేతికి రక్తపుమరకు అంటకుండా కడప ఉక్కును రాయలసీమ యువత ఆశలను బిజెపి హత్యచేసిందని విమర్శించారు. రాష్ట్రంలో అధికారానికి పోటీపడుతున్న వైసిపి, టిడిపిలు పరిశ్రమను సాధించడంలో ఘోరంగా విఫలమైనారని విమర్శించారు. తమ పార్టీకి 25మంది ఎంపీలు ఇస్తే కేంద్రం మెడలు వంచి సాధిస్తానని చెప్పి జగన్ మోహన్రెడ్డి కేంద్రం ముందు నడుముల వంగి సాష్టాంగ నమస్కారాలు చేస్తున్నారని విమర్శించారు. 2018లో కడప ఉక్కు పరిశ్రమ కోసం ఆమరణ దీక్షలు చేసిన టిడిపి నేడు మౌనం మౌనమేల ఉందని ప్రశ్నించారు. రాష్ట్ర విభజన సందర్భంగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి ప్రత్యేక హోదా ఐదు కాదు పది సంవత్సరాలు కావాలని అధికారంలోకి వచ్చిన వెంటనే ప్రత్యేక హోదాతో పాటు విభజన చట్టంలోని అంశాలను అమలుపరుస్తామని బిజెపి హామీ ఇచ్చింది. దానిని ఇప్పుడు తుంగలో తొక్కుతున్నది. విభజన చట్టం ప్రకారం కడప ఉక్కు పరిశ్రమ ప్రభుత్వరంగంలో నిర్మించాలి కానీ బిజెపి మొదటి నుంచి ఈపరిశ్రమ స్థాపనపై మోసపూరిత వైఖరి అనుసరిస్తున్నది ఇప్పటికైనా బీజేపీ మోసపూరిత తనాన్ని ప్రతిపక్షపార్టీ అధికార పార్టీ ప్రశ్నించాలని, వెనుకబడిన రాయలసీమకు ప్రత్యేక నిధులు కేటాయించాలని విభజన చట్టంలో ఇచ్చిన హామీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. సిపిఎం సీనియర్ నాయకులు పి.చైతన్య, సురేంద్రన్, ఓబుల్ రాజు, గిరిధర్ గుప్తా, భువనేశ్వరి మాట్లాడుతూ కడప ఉక్కు పరిశ్రమ రాయలసీమ ప్రజల చిరకాల కాంక్ష అని, ఈ ప్రాంత భూగర్భంలో 64 రకాల ఖనిజ నిక్షేపాలు ఉన్నాయన్నారు. ఇంత విలువైన ఇనుము, డోలమైట్, బంగారం, వజ్రాలున్న రత్నాలసీమను బిజెపి కరువు సీమగా మారుస్తున్నదని బిజెపి వైఖరిని ప్రతి ఒక్కరూ ఎండగట్టాలని పిలుపునిచ్చారు. ధర్నాలో నాయకులు ఈశ్వరయ్య, వినోద్కుమార్, బాలసుబ్రమణ్యం, దాము, రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

కడప ఉక్కు ఫ్యాక్టరీని ప్రభుత్వమే నిర్మించాలంటూ కలెక్టరేట్ ఎదుట సిపిఎం ఆందోళన

స్పందనకు 274 అర్జీలు

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్: స్పందనలో వచ్చే సమస్యలను వెంటనే పరిష్కరించాలని జిల్లా జాయింట్ కలెక్టర్ పి.శ్రీనివాసులు పేర్కొన్నారు. ప్రతి సోమవారం చిత్తూరు జిల్లా కలెక్టరేట్లో నిర్వహించే స్పందన కార్యక్రమంలో జిల్లా జాయింట్ కలెక్టర్, డిఆర్ఓ ఎన్.రాజశేఖర్, డిప్యూటీ కలెక్టర్ భవాని, జడ్పీ సీఈఓ ప్రభాకర్రెడ్డి, ఫారెస్ట్ సెటిల్మెంట్ అధికారి చంద్రశేఖర్ నాయుడు జిల్లా నలుమూలల నుండి వివిధరకాల సమస్యలతో వచ్చిన అర్జీదారుల నుండి అర్జీలను స్వీకరించారు. స్పందనకు మొత్తం 274 అర్జీలు రాగా ఇందులో శాఖల వారీగా అర్జీల వివరాలు ఇలా ఉన్నాయి. రెవెన్యూ శాఖకు సంబంధించి 183, జిల్లా ఎండోమెంట్ 2, జిల్లా పంచాయతీరాజ్ శాఖ1, మండల ప్రజాపరిషత్ 2, డ్వామా 2, నగర పాలక సంస్థ 3, సర్వశిక్ష అభియాన్ (పిఓఎస్ఎస్ఏ) 1, డిఆర్డిఏ 1, పొల్యూషన్ కంట్రోల్ బోర్డు 1, ఆరోగ్యశ్రీ 1, ఎపిఎస్ పిడిసిఎల్1, ఇరిగేషన్ శాఖ 1, ఎల్డిఎం 2, హెచ్ఎన్ఎస్ఎస్ శాఖ 1, జిల్లా హౌసింగ్ శాఖ 16, పెన్షన్, రేషన్ కార్డులు, ఇతరులు 56, అర్జీలు రావడం జరిగిందని తెలిపారు. స్పందన కార్యక్రమంలో వచ్చిన అర్జీల మీద జిల్లా అధికారులు సత్వరం చర్యలు తీసుకుని పరిష్కరించాల్సిందిగా ఆదేశించారు. ఈకార్యక్రమంలో వివిధ శాఖలకు సంబందించిన జిల్లా అధికారులు పాల్గొన్నారు.

స్పందన కార్యక్రమంలో అర్జీలు స్వీకరిస్తున్న జెసి

వేగంగా 'స్పందన' వినతుల పరిష్కారం : కమిషనర్ అరుణ

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్: స్పందన కార్యక్రమంలో ప్రజల నుంచి అందిన వినతులను వేగంగా పరిష్కరించాలని నగర కమిషనర్ డాక్టర్ జె.అరుణ అధికారులను ఆదేశించారు. సోమవారం నగరపాలక కార్యాలయంలో స్పందన కార్యక్రమాన్ని నిర్వహించి ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. స్పందన అర్జీలను ఆన్లైన్లో నమోదు చేయాలని, వినతులపై శాఖాధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించి నివేదిక ఇవ్వాలని ఆదేశించారు. గతవారం అందిన వినతులు, పరిష్కరించిన వాటి వివరాలపై సమీక్ష నిర్వహించారు. సోమవారం నాటి స్పందన కార్యక్రమంలో ఇంజనీరింగ్ 5, ప్రజారోగ్యం 2, టీపీవో 2, రెవెన్యూ ఒకటి చొప్పున మొత్తం పది వినతులు అందాయి. సహాయ కమిషనర్ గోవర్ధన్, ఎంఈ వెంకట ప్రసాద్, ఎంహెచ్వో డాక్టర్ లోకేష్, అధికారులు పాల్గొన్నారు.

వినతులు స్వీకరిస్తున్న కమిషనర్

'జగనన్నకు చెబుదాం' అర్జీలు వెంటనే పరిష్కరించాలి: జెసి

చిత్తూరుఅర్బన్: జగనన్నకు చెబుదాం సమస్యల అర్జీలను అర్జీదారునితో మాట్లాడి వెంటనే పరిస్కారం చేయాలని జిల్లా జాయింట్ కలెక్టర్ పి.శ్రీనివాసులు పేర్కొన్నారు. సోమవారం సాయంత్రం జిల్లా కలెక్టరేట్ సమావేశం హాల్లో వివిధ శాఖల జిల్లాస్థాయి అధికారులు, వీడియో కాన్ఫరెన్స్ మండలస్థాయి అధికారులతో జగనన్నాకు చెబుదాం, ఏపీ సేవ సర్వేసులు, ఓటిఎస్, జగనన్న సురక్ష, కళ్యాణ్మస్తు, కాపునేస్తం, వైఎస్సార్ సంపూర్ణకిట్, నియోజకవర్గాల వారీగా ఇంచార్జి మంత్రితో సమీక్ష, పిఆర్ భవనాలు, గహనిర్మాణంపై వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. జెసి మాట్లాడుతూ జగనన్నకు చెబుదాం సమస్యల అర్జీలను అర్జీదారునితో మాట్లాడి 24 గంటలు పరిష్కారం చేయాలని, సమస్యలు పెండింగ్లో లేకుండా ఎప్పటికప్పుడు వచ్చిన అర్జీలను పరిష్కరించాలన్నారు. రీ ఓపెన్ కాకుండా సమస్యల పరిష్కారం కోసం క్షేత్రస్థాయిలో పర్యటించి అర్జీదారులతో మాట్లాడి సమస్యలను పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. జగనన్న సురక్ష కార్యక్రమాన్ని జిల్లా అందరూ బాగా చేశారని, జిల్లా స్థాయిలో చిత్తూరు మున్సిపాలిటీ, బైరెడ్డిపల్లి, గంగాధర్ నెల్లూరు మండలాలు మొదటిస్థానంలో ఉన్నాయని అధికారులందరినీ అభినందిస్తున్నని తెలిపారు. ఇదేస్ఫూర్తితో అందరు కలిసి పనిచేసి రాష్ట్రస్థాయిలో జిల్లాను అన్నిరంగాలలో ముందంజలో ఉండే విధంగా పనిచేయాలన్నారు. సమీక్షలో జడ్పీ సీఈఓ ప్రభాకర్ రెడ్డి, డ్వామా పీడీలు గంగాభవాని, హౌసింగ్ పీడీ పద్మనాభం, ఎస్ఈలు గ్రామీణ నీటిసరఫరా, పంచాయతీ రాజ్ శంకరబాబు, చంద్రశేఖర్ రెడ్డి, జిల్లా వ్యవసాయశాఖ అధికారి మురళికష్ణ, డిపిఓ లక్ష్మి, డిఎస్ఓ శంకరన్, సిపిఓ ఉమాదేవి, డిఎల్డిఓ రవికుమార్, అధికారులు పాల్గొన్నారు.

పెనుమూరు కానిస్టేబుల్కు అభినందనలు

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్: పెనుమూరు పోలీస్స్టేషన్లో కానిస్టేబుల్గా పనిచేస్తున్న రఘురామ్కు ఒడిశా రాష్ట్రం మల్కన్గిరి జిల్లా ఎస్పీ నితేష్ వాద్వాని అభినందనలు తెలుపుతూ ప్రశంసాపత్రం పంపారు. ఒడిశా రాష్ట్రం మాల్కన్గిరి స్టేషన్ పరిధిలో వాంటెడ్గా ఉన్న తిరుపతికి చెందిన ప్రసాద్, రమేష్ అనే నిందితులను తమకు పట్టివ్వడంలో రఘురామ్ సాకారాన్ని ఆయన అభినందించారు. సోమవారం చిత్తూరు ఎస్పీ రిషాంత్ రెడ్డి చేతులమీదుగా ప్రశంసా పత్రంను రఘురామ్ అందుకున్నారు.

వీఓ మెర్జింగ్ను రద్దు చేయాలి

కలెక్టర్కు సిఐటియు వినతి

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్: జిల్లాలో ఉన్న వివోఏల సమస్యలు పరిష్కారం కోసం జిల్లా అధికారులు చొరవ చూపాలని సోమవారం జిల్లా కలెక్టరేట్లో జాయింట్ కలెక్టర్ శ్రీనివాసులకి సిఐటియు ఆధ్వర్యంలో వినతిపత్రం ఇవ్వడం జరిగింది. ఈసందర్భంగా యూనియన్ గౌరవాధ్యక్షుడు వాడ గంగరాజు, జిల్లా అధ్యక్ష,కార్యదర్శులు రాజశేఖర్, నాగరాజు, సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి కే.సురేంద్రన్ మాట్లాడుతూ జిల్లాలో అనేక మండలాల్లో రాజకీయ వేధింపులు తీవ్రమవుతున్నాయని వాటిని మానుకోవాలని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం గతంలో వివోఏలకు ఇచ్చిన హామీలు ప్రకారం వేతనాలు పెంచాలని తెలిపారు. 30 సంఘాల లోపు ఉన్న వివోను మెర్జ్చేసి ఎక్కువ సంఘాలుగా కలుపుతామని చెప్పడం సరైనది కాదని దానివల్ల వందలాది మంది విఓఏల ఉపాధి పోతుందని అన్నారు. వివోఏలకు హెచ్ఆర్ పాలసీ అమలు అమలు చేయాలని, జెండర్ విధానాన్ని రద్దు చేయాలని జాయింట్ కలెక్టర్ దష్టికి తీసుకువచ్చారు. జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో ఉన్న సమస్యలను డిఆర్డిఏ అధికారులు దష్టికి తెచ్చి పరిష్కారాన్ని కషి చేస్తామని, ఇతర సమస్యలు రాష్ట్ర ప్రభుత్వానికి తెలియజేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో శ్రీధర్, శేషాద్రి, మంగమ్మ తదితరులు పాల్గొన్నారు.

వీవోల సమస్యలపై జెసికి వినతి చేస్తున్న సిఐటియు నాయకులు

అంగరంగ వైభవంగా

శ్రీవారి బ్రహ్మోత్సవాలు

- సెప్టెంబరు 18 నుండి 26 వరకు సాలకట్ల ఉత్సవాలు
- అక్టోబర్ 15 నుండి 23 వరకు నవరాత్రి పూజలు
- పురటాసి మాసం సెప్టెంబర్ 18 నుండి అక్టోబర్ 17 వరకు
- భక్తుల సౌకర్యార్థం విస్తృత ఏర్పాట్లు : టీటీడీ ఈవో

శ్రీవారి బ్రహ్మోత్సవాలపై అధికారులతో సమీక్షిస్తున్న ఈవో ధర్మారెడ్డి

ప్రజాశక్తి- తిరుమల: అధికమాసం కారణంగా ఈ ఏడాది సెప్టెంబరు, అక్టోబరు నెలల్లో రెండు బ్రహ్మోత్సవాలు జరగనున్న నేపథ్యంలో, పురటాసి మాసం కూడా వస్తున్నందువల్ల భక్తుల రద్దీ అత్యధికంగా ఉంటుందని టీటీడీ ఈవో ఎవి.ధర్మారెడ్డి చెప్పారు. అన్ని విభాగాల అధికారులు జిల్లా యంత్రాంగంతో సమన్వయం చేసుకుని భక్తులకు ఎలాంటి ఇబ్బందులు ఎదురుకాకుండా చూడాలని అధికారులను ఆదేశించారు. జేఈవోలు సదాభార్గవి, వీరబ్రహ్మంలతో కలిసి టీటీడీలోని అన్ని విభాగాల అధికారులతో సోమవారం తిరుమలలోని అన్నమయ్య భవనంలో సమీక్ష నిర్వహించారు. అనంతరం ఈవో మీడియాతో మాట్లాడుతూ సెప్టెంబర్ 18 నుండి 26వ తేదీ వరకు సాలకట్ల బ్రహ్మోత్సవాలు, అక్టోబర్ 15 నుంచి 23వరకు నవరాత్రి బ్రహ్మోత్సవాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. బ్రహ్మోత్సవాల ఏర్పాట్లను ఒకటిన్నర నెల ముందుగానే ప్రారంభించినట్లు చెప్పారు. 15 రోజుల తరువాత, జిల్లా యంత్రాంగంతో సమీక్ష నిర్వహించనున్నట్లు ఆయన తెలియజేశారు. వార్షిక బ్రహ్మోత్సవాల్లో ముఖ్యమైన రోజుల్లో సెప్టెంబర్ 18న ధ్వజారోహణం ఉంటుందని, అదే రోజు రాష్ట్రముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్రెడ్డి రాష్ట్రప్రభుత్వం తరపున శ్రీవేంకటేశ్వర స్వామికి పట్టువస్త్రాలు సమర్పిస్తారని తెలిపారు. ముఖ్యమైన రోజుల్లో 22న గరుడ సేవ, 23న స్వర్ణరథం, 25న రథోత్సవం, 26న చక్రస్నానం, ధ్వజవరోహణంతో బ్రహ్మోత్సవాలు ముగుస్తాయన్నారు. అదేవిధంగా నవరాత్రి బ్రహ్మోత్సవాలు అక్టోబర్ 15న ప్రారంభమై 19న గరుడవాహనం, 22న స్వర్ణరథం, 23న చక్రస్నానంతో వస్తాయని చెప్పారు. ఇంజినీరింగ్ పనులు, అన్నప్రసాదం, దర్శనం, వసతి, పోలీసు, కళ్యాణకట్ట, రవాణా, హెచ్డిపిపి, ఉద్యానవనం, వైద్యం, ఆరోగ్యం, శ్రీవారి సేవకుల సమన్వయంతో టీటీడీ విజిలెన్స్ అండ్ సెక్యూరిటీ విభాగం భద్రతా ఏర్పాట్లపై సమీక్ష నిర్వహించినట్లు ఈవో తెలిపారు. పురటాసి మాసం, రెండు బ్రహ్మోత్సవాలు కలిసినందున, ఈ సంవత్సరం భారీ యాత్రికుల రద్దీని అంచనా వేస్తున్నామని ఈవో చెప్పారు. పురటాసి పవిత్ర మాసం సెప్టెంబర్ 18న ప్రారంభమై అక్టోబరు 17నముగుస్తుందన్నారు. సెప్టెంబరు 23, 30, అక్టోబర్ 7, 14 తేదీల్లో పురటాసి శనివారాలు జరుగుతాయని, ఈరెండు బ్రహ్మోత్సవాలు, పురటాసి శనివారాల్లో భక్తులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా దర్శనం కల్పించేలా ప్రణాళిక రూపొందించాలని సంబంధిత అధికారులను ఆదేశించామని తెలిపారు. ఎఫ్ఎసిఎవో బాలాజీ, డీఎల్వో వీర్రాజు, సీఈ నాగేశ్వరరావు, ఎస్ఈ-2 జగదీశ్వర్రెడ్డి, అదనపు ఎస్పీ మునిరామయ్య, ఆలయ డెప్యూటీ ఈవో లోకనాథం, తిరుమల పోలీసు అధికారులు పాల్గొన్నారు.

జెపి వెల్నెస్, స్వామి వివేకానంద ఫౌండేషన్ల ఆధ్వర్యంలో

అర్జీదారులకు అన్నప్రసాదాలు

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్: ప్రతి సోమవారం జిల్లా కలెక్టరేట్లో స్పందనకు వచ్చే అర్జీదారులకు అన్నప్రసాద పెట్టడం చాలా సంతోషంగా ఉందని జిల్లా జాయింట్ కలెక్టర్ పి.శ్రీనివాసులు తెలిపారు. డిఆర్ఓ ఎన్.రాజశేఖర్తో కలసి సోమవారం స్థానిక జిల్లా కలెక్టరేట్ ఆవరణలో జెపి వెల్నెస్ ఫౌండేషన్ రామకుప్పం, స్వామి వివేకానంద ఫౌండేషన్ చిత్తూరు వారి ఆధ్వర్యంలో అన్నప్రసాద వితరణ కార్యక్రమంలో పాల్గొననున్నారు. ఈసందర్భంగా జెసి మాట్లాడుతూ ప్రతి సోమవారం జిల్లా నలుమూలల నుండి తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ కలెక్టర్ కార్యాలయంలో నిర్వహించే స్పందన కార్యక్రమంలో సమస్యల అర్జీలను అందజేసి వెళ్లడం జరుగుతుందన్నారు. ప్రభుత్వం ద్వారా అన్ని సౌకర్యాలు కల్పించడం జరుగుతుందని అయితే అర్జీదారులు ఎక్కువ మంది రావడం ఆలస్యం అవుతుందని, ఆకలితో వెళ్ల కూడదని ఉద్దేశంతో జెపి వెల్నెస్ ఫౌండేషన్ రామకుప్పం, స్వామి వివేకానంద ఫౌండేషన్ చిత్తూరు వారి ఆధ్వర్యంలో అన్నప్రసాద వితరణ కార్యక్రమం నిర్వహించడం చాలా సంతోషంగా ఉందన్నారు. ఇంకపై ప్రతి సోమవారం జిల్లా కలెక్టర్ కార్యాలయ ఆవరణలో ఉచిత అన్న ప్రసాద కార్యక్రమం ఉంటుందని తెలిపారు. స్పందన కార్యక్రమంలో సమస్యల అర్జీలు సమర్పించుకొని భోజనం చేసుకొని వెళ్లాలని అర్జీదారులకు సూచించారు. అనంతరం అన్నప్రసాదంను అర్జీదారులకు పెట్టి కార్యక్రమాని ప్రారంభించారు. కార్యక్రమంలో జిల్లా మైనార్టీ సంక్షేమశాఖ అధికారి చిన్నారెడ్డి, జడ్పీ సీఈఓ ప్రభాకర్రెడ్డి, జెపి వెల్నెస్ ఫౌండేషన్ అధ్యక్షులు డాక్టర్ జెఎస్.జయప్రకాష్, స్వామివివేకానంద ఫౌండేషన్ అధ్యక్షులు జయకుమార్, తదితరులు పాల్గొన్నారు.

16 నుండి 19 వరకు

టీటీడీలో వస్త్రాల ఈ - వేలం

ప్రజాశక్తి- తిరుపతిబ్యూరో: తిరుమల శ్రీవారి ఆలయంతోపాటు ఇతర అనుబంధ ఆలయాలకు భక్తులు కానుకగా సమర్పించిన వస్త్రాలను ఆగష్టు 16 నుండి 19వ తేదీ వరకు ఈ- వేలం వేయనున్నట్లు సోమవారం టిటిడి అధికారులు ఓ ప్రకటనలో తెలిపారు. ఈవేలంలో కొత్తవి, ఉపయోగించిన, పాక్షికంగా దెబ్బతిన్న వస్త్రాలు 194 లాట్లు ఉన్నాయి. ఇందులో పాలిస్టర్, కాటన్ పంచలు, క్లాత్ బిట్స్, హుండీ గల్లేబులు, పవిత్రాలు, బ్లౌజ్పీస్లు, ఉత్తరీయాలు, టర్కీ టవళ్లు, లుంగీలు, శాలువలు, బెడ్షీట్లు, దిండుకవర్లు, పంజాబి డ్రెస్ మెటీరియల్స్, జంకాళం కార్పెట్లు, దుప్పట్లు, కర్టన్లు, గర్భగహ కురాళాలు, బంగారువాకిలి పరదాలు, కాకి పరదాలు ఉన్నాయి. ఇతర వివరాలకు తిరుపతిలోని టీటీడీ మార్కెటింగ్ కార్యాలయాన్ని 0877- 2264429 నంబరులో గానీ, టీటీడీ వెబ్సైట్ సంప్రదించగలరు.

ప్రజాసమస్యలు వెంటనే పరిష్కరించండి: మంత్రి

ప్రజాశక్తి- పుంగనూరు: పుంగనూరు మున్సిపాలిటీలో గత ఐదు రోజులుగా చేపట్టిన వార్డుబాట కార్యక్రమంలో వచ్చిన ప్రజా సమస్యలను వెంటనే పరిష్కరించాలని అధికారులకు పలు సూచనలు ఇచ్చారు. పట్టణంలో మున్సిపల్ చైర్మన్ అలీమ్బాషా ఆధ్వర్యంలో సోమవారం 1, 2, 7, 8, 15, 31 వార్డులలో వార్డుబాట కార్యక్రమాన్ని మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి నిర్వహించారు. పుంగనూరు పట్టణంలో 31వార్డులలో 5 రోజుల పాటు సాగిన రాష్ట్ర అటవీశాఖ మంత్రి వార్డుబాట విజయవంతంగా పూర్తిచేశారు. పుంగనూరు పట్టణంలో మంత్రి పలు ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాల ప్రారంభోత్సవాలు, శంఖుస్థాపనలు చేశారు. ఈసందర్భంగా మంత్రి మాట్లాడుతూ రూ.41కోట్లతో పుంగనూరులో మదనపల్లె- పలమనేరు రహదారి నిర్మాణం చేపట్టనున్నట్టు తెలిపారు. రూ.22 కోట్లతో ఇరిగేషన్శాఖ ద్వారా కౌండిన్య నదికి మరమ్మతులు చేపడతామని తెలిపారు. రాష్ట్ర ముఖ్యమంత్రి వై. యస్.జగన్ మోహన్ రెడ్డి చొరవతో గత నాలుగున్నర సంవత్సరాల నుండి పుంగనూరు పట్టణం, చుట్టూ పక్కల అభివద్ధిలో నిర్దిష్టమైన మార్పులు చూస్తున్నామని అన్నారు.

పట్టణంలో కౌండిన్య నది రెండు పాయలుగా ప్రవహిస్తున్నదని, గత రెండు సంవత్సరాల క్రితం వచ్చిన ప్రకతి విపత్తుల కారణంగా దెబ్బతిన్న కౌండిన్య, రాయలచెరువుకు సంబంధించి ఇరిగేషన్ శాఖ ద్వారా శాశ్వత ప్రాతిపదికన దాదాపు రూ.22 కోట్ల ఖర్చుతో పూడికలు, ఆక్రమణలు తొలగించి, కాంక్రీట్ లైనింగ్ చేయించి మరమ్మత్తులు చేపట్టడం జరుగుతుందని, దీని మూలంగా పట్టణంలో మురికినీటి సమస్య తొలగుతుందని, ఈ కారణంగా పుంగనూరు మున్సిపాలిటీ మరోసారి జాతీయ స్థాయిలో పురస్కారాలు లభించే అవకాశం ఉన్నదని తెలిపారు. పట్టణంలో శాశ్వత తాగునీటి సమస్య పరిష్కారానికి రూ.13 కోట్లతో సమ్మర్ స్టోరేజ్ ట్యాంక్ నుండి ఓవర్ హెడ్ ట్యాంక్లకు నీటి సరఫరా చేసి ప్రతి ఇంటికి కుళాయిల ద్వారా నీటి సరఫరాకు ఏర్పాట్లు చేయడం జరిగిందని, ఇందుకు సంబంధించి టెండర్ లను పిలవడం జరిగిందని తెలిపారు. వార్డు బాటలో భాగంగా పట్టణంలో కొన్ని చోట్ల తారు రోడ్లు అవసరమని గుర్తించామని, దాదాపు కోటి రూపాయలు ఖర్చుతో తారురోడ్లు వేయించడం జరుగుతుందని తెలిపారు. మున్సిపాలిటీ పరిధిలో పెండింగ్లో ఉన్న అన్ని అభివద్ధి పనులు రానున్న 5నెలల్లో పూర్తి చేసేలా చర్యలు చేపడతామని, పట్టణాన్ని సుందరంగా తీర్చిదిద్దుతామన్నారు. కార్యక్రమంలో జెడ్పి ఛైర్మన్ గోవిందప్ప శ్రీనివాసులు, రాష్ట్ర జానపద కళల కార్పొరేషన్ చైర్మన్ కొండవీటి నాగభూషణం, పికెఎం ఉడా చైర్మన్ వెంకట్ రెడ్డి యాదవ్, జిల్లా వక్ఫ్ బోర్డ్ చైర్మన్ అమ్ము, కమిషనర్ నరసింహ ప్రసాద్, ఎంపీపీ భాస్కర్రెడ్డి, తహసీల్దారు సీతారాం, అధికారులు, ప్రజాప్రతినిధులు, నాయకులు పెద్దిరెడ్డి జింకా చలపతి, ఎంఆర్సి రెడ్డి, చంద్రారెడ్డి యాదవ్, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

కాంట్రాక్ట్ కార్మికులను పర్మినెంట్ చేయాలి

గాంధీ విగ్రహం ఎదుట విద్యుత్ కార్మికుల ధర్నా

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్: విద్యుత్ ఉద్యోగులు కార్మికుల జేఏసీ పిలుపుమేరకు సోమవారం గాంధీ విగ్రహం ఎదుట విద్యుత్ కార్మికులు నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా జేఏసీ నాయకులు శేషాద్రి, పద్మనాభ పిల్లై, యజ్ఞేశ్వరరావు, రాజేంద్రబాబు, వరదరాజులు మాట్లాడుతూ 25 సంవత్సరాలుగా పనిచేస్తున్న కాంట్రాక్టు కార్మికులను రెగ్యులరైజ్ చేయాలి,సచివాలయ విద్యుత్ ఉద్యోగులు, సచివాలయ ఉద్యోగులతో సమానంగా వారిని రెగ్యులర్ చేయాలి, ప్రమాదంలో మరణించిన వారి కుటుంబం నుండి కారుణ్య నియామకం చేపట్టాలని, క్షేత్రస్థాయిలో వున్న వందల ఖాళీలను భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. అలాగే ఒక్కో ఉద్యోగి నలుగురి పనిచేస్తున్నారని, హక్కుగా రావాల్సిన డీఏలను వెంటనే రిలీజ్ చేయాలని డిమాండ్ చేశారు. 2022 పేరివిజన్ 16 నెలలుగా కాలయాపన చేస్తున్నారని, పేరివిజన్ని వెంటనే అమలు చేయాలని కోరారు. కార్యక్రమంలో జేఏసీ నాయకులు గోవిందన్, యగ్నేష్, గౌతం, రాజా, కరీముల్లా ఖాన్, నీరజ, రవిచంద్రన్, పరంధామరెడ్డి, బి.హరి, వివేకానంద రెడ్డి, నిరంజన్, విద్యుత్ కాంట్రాక్ట్ కార్మికులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

గాంధీ విగ్రహం ఎదుట ధర్నా చేస్తున్న విద్యుత్ కాంట్రాక్ట్ కార్మికులు

ఈ-క్రాప్ బుకింగ్ తప్పనిసరి



సమావేశంలో మాట్లాడుతున్న ఏవో ఢిల్లీ ప్రసాద్

ప్రజాశక్తి-పాలసముద్రం: మండల పరిధిలోని రైతులు సాగుచేసిన పంటలను ఈ-క్రాప్ బుకింగ్ తప్పనిసరిగా చేసుకోవాలని ఏవో ఢిల్లీ ప్రసాద్ అన్నారు. సోమవారం స్థానిక రైతు భరోసా కేంద్రంలో రైతులకు ఏర్పాటుచేసిన సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ప్రతి రైతు పంట నమోదు చేసుకుంటేనే ప్రభుత్వం నుంచి రైతులకు అందవలసిన ఇన్స్యూరెన్స్, ఇన్‌పుట్ సబ్సిడీ అందుతుందని తెలిపారు. అదేవిధంగా ప్రకతి విపత్తు వల్ల సంభవించే నష్టాలను ప్రభుత్వం ద్వారా ఆర్థిక సహాయాన్ని అందించే అవకాశం ఉంటుందన్నారు. అనంతరం చిరుధాన్యాల సాగుతో రైతులు తక్కువ పెట్టుబడి, సమయంతో ఎక్కువ ఆదాయం పొందవచ్చని తెలిపారు. కార్యక్రమంలో రైతు భరోసా సిబ్బంది మధుసూదన్, భాస్కర్ నాయక్, నవనీత, రైతులు పాల్గొన్నారు.

మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి

కార్యక్రమంలో మాట్లాడుతున్న సీనియర్ సివిల్ జడ్జి కరుణ కుమార్

ప్రజాశక్తి-బంగారుపాళ్యం: మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని సీనియర్ సివిల్ జడ్జి కరుణ కుమార్ అన్నారు. సోమవారం మండలంలోని విజ్ఞాన్ డిగ్రీ కళాశాలలో చిత్తూరు స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో సిఐ చంద్రశేఖర్ ఆధ్వర్యంలో మాదక ద్రవ్యాలపై అవగాహన సదస్సు జరిగింది. ఈ సందర్భంగా సీనియర్ సివిల్ జడ్జి మాట్లాడుతూ విద్యార్థి దశ నుండి మాదకద్రవ్యాలైన గుట్కా, ఖైనీ వంటివాటిపై అవగాహన పెంచుకోవాలని, మాదకద్రవ్యాలు వాడటంతో ఆరోగ్యం క్షీణిస్తుందని తెలిపారు. అనంతరం మాదకద్రవ్యాల నిషేధంపై వివరించారు. కార్యక్రమంలో కళాశాల కరస్పాండెంట్ వెంకటా చలపతి, స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో ఎస్ఐ మోహన్ బాబు, హెడ్ కానిస్టేబుల్ కృష్ణయ్య, అధ్యాపకులు నవీన్ కుమార్, చిట్టిబాబు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

వాల్మీకులను ఎస్టీల్లో చేర్చాలి

సమావేశంలో పాల్గొన్న వాల్మీకి కులసంఘ పెద్దలు

ప్రజాశక్తి-శాంతిపురం: వాల్మీకి, బోయ కులస్తులను ఎస్టీ జాబితాలో చేర్చాలని ఆ కుల సంఘం పెద్దలు డిమాండ్ చేశారు. సోమవారం మండలంలోని వాల్మీకి సోదరుల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా భవిష్యత్తు కార్యచరణ ఎలా ఉండాలి అనేదానిపైన చర్చించి వాల్మీకులకు ఎస్టీ హోదా కల్పించాలని ప్రభుత్వాన్ని కోరుతూ మండల వాల్మీకి అధ్యక్షులు, ప్రధాన కార్యదర్శులను ఏకగ్రీవంగా వారు ఎన్నుకున్నారు. అధ్యక్షులుగా నంజంపేట సూరి, కార్యదర్శిగా నిమ్మనపల్లి రవి కుమార్‌లను ఎన్నుకున్నారు. సమావేశంలో రాష్ట్ర వాల్మీకి సాధికార కమిటీ సింగిరి శ్రీనివాసులు, చిత్తూరు పార్లమెంట్ అధ్యక్షులు బెటప్ప నాయుడు, గుడిపల్లి తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు బాబు నాయుడు, గోవిందు, రామచంద్ర, ప్రభాకర్ పాల్గొన్నారు.

జయరాజ్ శేఖర్‌కు డాక్టరేట్

డాక్టరేట్ అందుకున్న జయరాజ్ శేఖర్

ప్రజాశక్తి-కార్వేటినగరం: మండల పరిధిలోని కత్తెరపల్లి ఉన్నత పాఠశాలలో గణిత ఉపాధ్యాయుడిగా విధులు నిర్వహిస్తున్న జయరాజ్ శేఖర్‌కు గౌరవ డాక్టరేట్ అవార్డు వచ్చిందని డీసీఈబీ కార్యదర్శి కే. హేమరెడ్డి తెలిపారు. సోమవారం పాఠశాల ఆవరణంలో ఆవార్డు గ్రహీతను ఉపాధ్యాయ బృందం శాలువాలతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా హేమరెడ్డి మాట్లాడుతూ గత ఆరు సంవత్సరాలుగా జయరాజ్ శేఖర్ సామాజిక సేవలు అందించారని, అదేవిధంగా కరోనా సమయంలో సామాజిక అవగాహన కల్పించడంతో పాటు, రక్తదానం, నిత్యావసర సరుకులు అందించారని, ఇలాంటి సేవలు అందించిన జయరాజ్ శేఖర్‌ను ఆసియా ఇంటర్నేషనల్ కల్చర్ అకాడమీ వారు గుర్తించి తమిళనాడులోని హోసూరులో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో గౌరవ డాక్టరేట్‌ను ప్రదానం చేయడం జరిగిందన్నారు. సామాజిక సేవలు అందించే ఉపాధ్యాయుడు తమ పాఠశాలలో ఉండటం ఎంతో గర్వంగా ఉందని కొనియాడారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

మాసపత్రిక విద్యార్థులకు ఉపయోగం



మంగళ విద్యావాణి మాసపత్రిక 22వ సంచిక ఆవిష్కరిస్తున్న దృశ్యం

ప్రజాశక్తి-బంగారుపాళ్యం: మంగళ విద్యావాణి మాసపత్రిక విద్యార్థులకు ఎంతో ఉపయోగకరమని ఆంధ్ర విశ్వవిద్యాలయ విశ్రాంత ఆచార్యులు రాధాకృష్ణారెడ్డి అన్నారు. సోమవారం మండలంలోని మంగళపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మంగళ విద్యావాణి మాసపత్రిక 22వ సంచిక ఆవిష్కరణ కార్యక్రమం ప్రధానోపాధ్యాయులు రాజ్యలక్ష్మి ఆధ్వర్యంలో జరిగింది. ఈ సందర్భంగా రామకృష్ణారెడ్డి మాట్లాడుతూ విద్యార్థులకు అవసరమైన విద్యను మాస పత్రిక ద్వారా అందించడం హర్షించదగ్గ విషయమని, ఉపాధ్యాయులు దీనికి ఎంతో శ్రమించి తయారుచేసిన ప్రశ్నలు, జవాబులు విద్యపై అవగాహన పెంచుతాయని, ఈ పాఠశాలలో ప్రత్యేకత తయారుచేసి అందివ్వడం చాలా శుభప్రదమైనదన్నారు. 22వ సంచికకు సరస్వతి ఛారిటబుల్ ట్రస్ట్ రూ.4 వేలు ఆర్థిక సహాయం అందించి ముద్రణ కార్యక్రమానికి సహకరించినందుకు వారికి ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు. అనంతరం మంగళ విద్యావాణి మాస పత్రికను ఆవిష్కరించారు. కార్యక్రమంలో సరస్వతి ఛారిటబుల్ ట్రస్ట్ ప్రతినిధి అమర్‌నాథరెడ్డి, యాదమరి మండలం కే గొల్లపల్లి ప్రధానోపాధ్యాయులు లలిత, ఎస్ఎంసీ ఛైర్మన్ యాగమూర్తి, ఉపాధ్యాయులు రమాదేవి, సంజీవి, పిల్లారప్ప, సంపంగి తదితరులు పాల్గొన్నారు.

జగన్ పాలనలో అన్ని వర్గాల్లో అభివృద్ధి: మంత్రి

లబ్దిదారునికి సంక్షేమ పథకాలను వివరిస్తున్న రోజా

ప్రజాశక్తి-నగరి: సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పాలనలో అన్ని వర్గాలు అభివృద్ధి చెందాయని, ప్రతి గడపలోనూ సంతోషాలు వెల్లివిరుస్తున్నాయని రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, యువజన సర్వీసుల, క్రీడాశాఖ మంత్రి ఆర్కేరోజా అన్నారు. సోమవారం మున్సిపల్ పరిధి 2వ వార్డు ఎంకెకె కండ్రిగ, కాకవేడు, కాకవేడు ఎస్టీకాలనీ, ఆదిఆంధ్రవాడ ప్రాంతాల్లో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా ఆమె పర్యటించారు. మండల స్థాయి అధికారులతో కలిసి ఆమె గడపగడపకు వెళ్లి వారికి గత నాలుగేళ్ళలో ప్రభుత్వ సంక్షేమ పథకాల ద్వారా చేకూరిన లబ్దిని వివరిస్తూ సంక్షేమ బుక్‌లెట్స్‌ను అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సంక్షేమ పాలనపై వైసీపీ ప్రభుత్వం ఏర్పడిన తరువాత ప్రజా సంక్షేమమే ధ్యేయంగా పాలన కొనసాగుతోందన్నారు. మధ్యవర్తుల ప్రమేయం లేకుండా లబ్దిదారుల చెంతకే సంక్షేమం వెళుతోందన్నారు. నిలకడైన అభివృద్ధికి అవసరమైన విద్య, వైద్య రంగాలకు అధిక ప్రాధాన్యం ఇస్తూ పాలన కొనసాగుతోందన్నారు. గత ప్రభుత్వ పాలనకు ప్రస్తుత పాలనకు మధ్య వ్యత్యాసాన్ని చూడాలని ఆమె కోరారు. చంద్రబాబు నాయుడు గత ఎన్నికల్లో ఇచ్చిన 600 హామీలను మాఫీచేసి ఓట్లువేసి గెలిపించిన ప్రజలకు వెన్నుపోటు పొడిచారన్నారు. మరోసారి మభ్యపెట్టడానికి నేడు ప్రజల ముందుకు వస్తున్నారన్నారు. మంచికి ప్రజలు అండగా నిలవాలన్నారు. ప్రతి ప్రాంతంలోనూ మంత్రికి స్థానికులు గజమాలలు, దుశ్శాలువాలతో సత్కరించి హారతులు ఎట్టి స్వాగతం పలికారు. కార్యక్రమంలో మున్సిపల్ ఛైర్మన్ పీజీ నీలమేఘం, వైస్ ఛైర్మన్ వెంకటరత్నం రెడ్డి, మున్సిపల్ కమిషనర్ వెంకట్రామిరెడ్డి, తహశీల్దార్ చంద్రశేఖర్ రెడ్డి, సీడీపీవో కష్ణవేణి, మెప్మా టీఎల్ఎం సునీత పాల్గొన్నారు.

ఘనంగా ధనుంజయరెడ్డి జన్మదిన వేడుకలు

యాదమరిలో అన్నదానం చేస్తున్న జడ్పీ ఛైర్మన్, బిఎంఆర్ సంస్థల అధినేత

ప్రజాశక్తి-యాదమరి/చిత్తూరు అర్బన్: జిల్లా పరిషత్ జడ్పీ వైస్ ఛైర్మన్ బి ధనుంజయ రెడ్డి జన్మదిన వేడుకలను యాదమరిలో ఘనంగా నిర్వహించారు. సోమవారం జిల్లా ప్రజా పరిషత్ మండల అధ్యక్షుడు సురేష్ బాబు ఆధ్వర్యంలో మండల కేంద్రంలో భారీ కేకును కట్ చేసి ధనుంజయ రెడ్డికి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా పేదలకు అన్నదానం, పండ్లు, స్వీట్లు పంపిణీ చేశారు. జన్మదిన వేడుకలకు బిఎంఆర్ సంస్థల అధినేత మోహన్ రెడ్డి హాజరయ్యారు. కార్యక్రమంలో మండల ఉపాధ్యక్షులు రవీంద్ర హరినారాయణ రెడ్డి, మాజీ జడ్పిటిసి మనోహర్, మాజీ సర్పంచుల సంఘం అధ్యక్షుడు మనోహర్ రెడ్డి, యాదమరి సర్పంచ్ ఝాన్సీ పలని, వైసీపీ నాయకులు సురేష్, కార్తీక్‌రెడ్డి పాల్గొన్నారు.

వినాయకుని సేవలో జడ్పీ వైస్ ఛైర్మన్

యాదమరి: జిల్లా జడ్పీ వైస్ ఛైర్మన్ బి ధనుంజయ రెడ్డి కాణిపాక వరసిద్ధి వినాయకుని దర్శించుకున్నారు. సోమవారం ఆలయ అధికారులు, ఆలయ ఛైర్మన్ మోహన్ రెడ్డి ఆయనకు పూర్ణకుంభంతో స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. అనంతరం మూషిక మండపంలో అర్చకులతో, వేదమంత్రాలతో ఆశీర్వదించారు.

జడ్పీ వైస్ ఛైర్మన్‌కు జన్మదిన శుభాకాంక్షలు తెలుపుతున్న విజయానంద రెడ్డి

రాయితీపై చాఫ్ కట్టర్ల పంపిణీ

వెదురుకుప్పం: పాడిరైతుకు చాఫ్ కట్టర్‌ను అందిస్తున్న రూపసుందరి

ప్రజాశక్తి-వెదురుకుప్పం: మండల కేంద్రంలో అర్హులైన 56 మంది పాడి రైతులకు 40 శాతం సబ్సిడీపై గడ్డి కత్తిరించు యంత్రాలను వెదురుకుప్పం సహాయ సంచాలకులు డాక్టర్ రూపసుందరి సోమవారం అందించారు. ఈ సందర్భంగా రూపసుందరి మాట్లాడుతూ చాఫ్ కట్టర్లను ఉపయోగించుట ద్వారా గడ్డి వధాను తగ్గించి అధిక పోషణ విలువలు గల గడ్డిని పశువులకు అందించవచ్చునని తెలియజేశారు. కార్యక్రమంలో వైసీపీ రాష్ట్ర సమన్వయకర్త బండి హేమ సుందర్ రెడ్డి, స్థానిక నాయకులు మరకాలకుప్పం రామయ్య, బొమ్మయపల్లి సర్పంచ్ చొక్కా గోవిందయ్య, జిల్లా స్టీరింగ్ కమిటీ సభ్యులు బొమ్మసముద్రం శివాజీ, పెద్దిరెడ్డి, మండల వైసీపీ యూత్ అధ్యక్షులు బోడ్డిరెడ్డి నరేష్ రెడ్డి, పాడి రైతులు పాల్గొన్నారు.

గంగాధర నెల్లూరు: రైతులకు 40 శాతం సబ్సిడీతో రాష్ట్ర ప్రభుత్వం చాఫ్ కట్టర్ యంత్రాలను పంపిణీ చేస్తున్నట్లు ఎంపీపీ అనిత, స్థానిక సర్పంచ్ సుబ్రమణ్యం అన్నారు. సోమవారం గంగాధర నెల్లూరు పశుసంవర్ధక శాఖ ఏడీ మురళీ మోహన్ ఆధ్వర్యంలో అధికారులు, నేతలతో కలిసి ఎంపీపీ అనిత పాడి రైతులకు చాఫ్ కట్టర్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ చాఫ్ కట్టర్ మొత్తం విలువ రూ.33,970 లు, అయితే మండలంలోని ఒక్కొక్క పాడి రైతుకు 40 శాతం సబ్సిడీతో రూ.13,588లు పోను, మిగిలిన మొత్తం రూ.20,382లకు అందించనున్నట్లు, కావాల్సిన వారు బ్యాంకులో డీడీ రూపంలో నగదును చెల్లించాల్సి ఉంటుందన్నారు. కార్యక్రమంలో పశుసంవర్ధక శాఖ ఉపసంచాలకులు డాక్టర్ ఆరిఫ్, ఎట్టెరి పశువైద్యాధికారి డాక్టర్ నాగాంజనేయులు, బుక్కాపట్నం సర్పంచ్ మునిరాజా రెడ్డి, వేపంజేరి ఎంపీటీసీ రామచంద్రా రెడ్డి, పాడి రైతులు పాల్గొన్నారు.

గంగాధర నెల్లూరులో రైతుకు చాఫ్ కట్టర్ యంత్రాన్ని పంపిణీ చేస్తున్న ఎంపీపీ

మురుగునీటి కాలువ పనులకు ప్రతిపాదనలు

కాలువను పరిశీలిస్తున్న అధికారులు

ప్రజాశక్తి-బంగారుపాళ్యం: మురికి కాలువ పనులకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలని ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ శ్రీనివాసులు సోమవారం అన్నారు. మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల నుండి పాత తపాల కార్యాలయం వరకు మురికి కాలువ పాడైపోయిందని, దీంతో కాలువలోని మురికి నీరు జాతీయ రహదారిపై ప్రవహిస్తుందని స్థానికులు గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఎమ్మెల్యే ఎంఎస్ బాబుకు విన్నవించారు. స్పందించిన ఎమ్మెల్యే స్థానిక సర్పంచ్, అధికారులు ప్రతిపాదనలు సిద్ధం చేసి ఉన్నత అధికారులకు పంపించాలని తెలిపారు. క్షేత్రస్థాయిలో ఉన్నతాధికారులు పరిశీలించి సచివాలయాలకు మంజూరు చేస్తున్న గడపగడపకు నిధుల్లో ప్రతిపాదనలు సిద్ధం చేసి పంపాలని ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ శంకర్ కి ఆదేశాలు జారీ చేశారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ కృష్ణమూర్తి, సచివాలయ, సైట్ ఇంజినీర్లు తదితరులు పాల్గొన్నారు.

ఆడికృత్తిక వేడుకలకు ముస్తాబు

కళ కళలాడుతున్న స్కంద పుష్కరిణి

ప్రజాశక్తి-కార్వేటినగరం: మండల కేంద్రంలో ప్రసిద్ధి చెందిన స్కంద పుష్కరిణీ సమీపంలో కుమారగిరిపై వెలిసిన వళ్లీ దేవసేన సమేత శ్రీవేణుగోపాలస్వామి ఆలయంలో 8వ తేదీ నుంచి నిర్వహించ తలపెట్టిన ఆడికృత్తిక వార్షిక బ్రహ్మోత్సవాలకు ఆలయాన్ని శరవేగంగా ముస్తాబు చేస్తున్నారు. ఇందులో భాగంగా రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి నారాయణస్వామి చొరవతో ఆలయ అభివద్ధికి రూ.75 లక్షలు మంజూరు చేశారు. దీంతో ఆలయం చుట్టూ పార్కింగ్ ఏర్పాటుకు జేసీబీల ద్వారా బండలను తొలగించి ఆడికత్తిక ఉత్సవాల్లో భక్తులు కొండపై నిద్ర చేసేందుకు వీలుగా ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఏర్పాట్లు చేస్తున్నారు. అదే విధంగా రూ.40 లక్షలతో ఆలయానికి ప్రహరీ నిర్మాణం చేశారు. అలాగే ఆలయంలో రూ.35 లక్షలతో ఫ్లోరింగ్ ఏర్పాటు చేశారు. కుమారగిరికి భక్తుల వాహనాలు రాక పోకలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా రోడ్డు మార్గాన్ని ఏర్పాటు చేశారు. అదేవిధంగా ఆలయం పై భాగం ఉరుపులు లేకుండా పనులు చేపట్టి వళ్లీ దేవసేన సమేత శ్రీసుబ్రమణ్యస్వామి ఆలయానికి పూర్వ వైభవాన్ని తీసుకొచ్చారు. ఆలయ ఆవరణంలో దాతల సహాయంతో పోటు నిర్వహణకు భవన నిర్మాణం చేపడుతున్నారు. అదేవిధంగా ఆడికత్తిగా సందర్భంగా కార్వేటినగరంకు బస్సు సౌకర్యం కలదని ఆలయ అధికారి కేశవరెడ్డి పేర్కొన్నారు.

ఆలయాలకు నిలయం కార్వేటినగరం

తాను పుట్టిన గడ్డ కార్వేటినగరం, సంస్థానాధీశుల కాలంలో ఆలయాల నిర్మాణానికి ప్రాముఖ్యత నిచ్చి అనేక ఆలయాలు నిర్మాణాలు చేపట్టి కార్వేటినగరాన్ని ఆలయాలకు నిలయం గా మార్చారు. ఆ ఆలయాలకు పునర్జీవం పోసేందుకు ఉప ముఖ్యమంత్రి ఎండోమెంట్ ద్వారా రూ.75 లక్షలు మంజూరు చేసి ఆలయానికి పూర్వ వైభవం తీసుకొస్తున్నా. స్కంధ పుష్కరిణీలో నిరాలి మండపం నిర్మాణానికి రూ.1.20 కోట్లు, స్కంధ పుష్కరిణీ చుట్టు పార్కు ఏర్పాటుకు రూ.40 లక్షల నిధులు మంజూరు చేయించా **- నారాయణస్వామి డిప్యూటీ సీఎం**

ఎస్వీయూ వైస్ ఛాన్స్‌లర్‌కు వినతి



ప్రజాశక్తి-క్యాంపస్: శ్రీ వెంకటేశ్వర యూనివర్సిటీ వైస్ ఛాన్స్‌లర్ రాజారెడ్డికి బిఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు ఆర్కాట్ కృష్ణప్రసాద్ ఆధ్వర్యంలో ఎస్వీయూ ప్రాంగణంలో మాస్టర్ ప్లాన్ రోడ్ల ప్రతిపాదన విరమించుకోవాలని వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా బిఆర్ఎస్ రాష్ట్ర నాయకులు మాట్లాడుతూ రాయలసీమలో అతిపెద్ద విశ్వవిద్యాలయంగా తిరుపతిలో వెలిసిన శ్రీ వెంకటేశ్వర యూనివర్సిటీలో ఎందరో మహనీయులు, ప్రముఖులు, ముఖ్యమంత్రులు విద్యను అభ్యసించారని తెలిపారు. దీనికి ముఖ్యకారణం ఎస్వీయూలోని ఆహ్లాదకరమైన వాతావరణం అన్నారు. కార్యక్రమంలో బిఆర్ఎస్ నాయకులు కల్లూరి బాలసుబ్రమణ్యం, బెల్లంకొండ సురేష్, రాజేంద్ర, రాఘవరెడ్డి, రామారావు తదితరులు పాల్గొన్నారు.

ప్రజావసరాలకే తొలి ప్రాధాన్యం

మాట్లాడుతున్న మున్సిపల్ ఛైర్మన్ పీజీ నీలమేఘం

ప్రజాశక్తి-నగరి: ప్రజావసరాలకు తొలి ప్రాధాన్యం ఇస్తూ మున్సిపాలిటీ నిర్వహణ ముందుకు సాగుతోందని, అందుకు మంత్రి ఆర్కేరోజా పూర్తిస్థాయిలో సహకారం అందిస్తున్నారని మున్సిపల్ ఛైర్మన్ పీజీ నీలమేఘం అన్నారు. సోమవారం నగరి మున్సిపల్ కార్యాలయంలో ఆయన సాధారణ సమావేశం నిర్వహించారు. మున్సిపల్ కమిషనర్ వెంకట్రామిరెడ్డి సమావేశపు అజెండాను సభ్యులకు చదివి వినిపించారు. అజెండాలో ఏమైనా అభ్యంతరాలుంటే తెలపాలన్నారు. కౌన్సిలర్ భారతి మాట్లాడుతూ కుశస్థలి నదిపై వంతెనను సరిచేయాలని కౌన్సిల్‌ను కోరారు. దీనిపై కమిషనర్ మాట్లాడుతూ అది ఆర్ అండ్‌బి పరిధిలోకి వస్తుందని వారికి లేఖ ద్వారా సమస్యను తెలియజేస్తామన్నారు. అనంతరం మున్సిపల్ ఛైర్మన్ మాట్లాడుతూ మంత్రి ఆర్కేరోజా సహకారంతో మున్సిపల్ పరిధిలోని అన్ని వార్డుల్లోనూ ప్రజావసరాలను పూర్తిచేస్తూ ముందుకు సాగుతున్నామన్నారు. గడపగడపకు నిధుల ద్వారా వార్డుకు రూ.20 లక్షల చొప్పున అభివృద్ధికి వెచ్చించడం జరుగుతోందన్నారు. నూతన మున్సిపల్ కార్యాలయం కూడా త్వరలో నిర్మించనున్నామన్నారు. సమావేశంలో వైస్ ఛైర్మన్లు వెంకటరత్నం, దయానిధి, కౌన్సిలర్లు, కోఆప్షన్ సభ్యులు, డీఈ నరేష్, మేనేజర్ శేఖర్, టీపీవో నీరజాక్షి, సీడీపీవో కృష్ణవేణి పాల్గొన్నారు.

కొండ మల్లేశ్వరునికి ప్రత్యేక పూజలు

శివనామ సంకీర్తన చేస్తున్న భక్తులు

ప్రజాశక్తి-వెదురుకుప్పం: మండలంలోని మాంబేడు పంచాయతీ దుద్దే రామానాయుడు కండ్రిగ సమీపంలో అరుణగిరి క్షేత్రంపై వెలిసిన శ్రీ జ్ఞాన ప్రసూనాంబ కొండ మల్లేశ్వర సమేత కొండ మల్లేశ్వర స్వామికి సోమవారం భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకులు స్వామివారికి గర్భగుడిలో ప్రత్యేక పూజలను నిర్వహించి వచ్చిన భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు. తీర్థ ప్రసాదాలను సద్వినియోగం చేశారు. మధ్యాహ్నం ఆలయ కమిటీ ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. శివనామ సంకీర్తనలతో అరుణగిరి క్షేత్రం మారుమోగింది. కార్యక్రమంలో ఆలయ నిర్వాహకులు, భక్తులు పాల్గొన్నారు.

గుర్రప్ప స్వామికి...

గుర్రప్ప స్వామిని దర్శించుకుంటున్న భక్తులు

ప్రజాశక్తి-వెదురుకుప్పం: మండలంలోని నల్లవంగన పల్లి గ్రామపంచాయతీ కిచ్చమ నాయుడుపల్లి గ్రామంలో వెలిసిన గ్రామ దేవత గుర్రప్ప స్వామికి ప్రత్యేక పూజలు, అభిషేకం నిర్వహించి అనంతరం ప్రత్యేక అలంకరణతో భక్తులకు దర్శన భాగ్యం కల్పించి స్వామివారి ప్రసాదమును భక్తులకు అందజేశారు. భక్తిశ్రద్ధలతో స్వామివారిని దర్శించుకుంటే వారు కోరుకునే కోరిక తీరుతాయని భక్తుల నమ్మకం. కార్యక్రమానికి యుఎస్ఏ రాజేష్ కుటుంబ సభ్యులు ఉభయదారులుగా వ్యవహరించారు. వారితోపాటు మోహన, మాజీ వాటర్ షెడ్ ఛైర్మన్ గుణశేఖర్ నాయుడు కుటుంబ సభ్యులు, కష్ణమ నాయుడు, వత్తనాధ నాయుడు, నాదముని నాయుడు, భక్తులు పాల్గొన్నారు.

దౌర్జన్యంగా భూమి లాక్కుంటున్నారు



ఆస్తి పత్రాలను చూపుతున్న వైసీపీ నాయకురాలు పోంగోడి

ప్రజాశక్తి-చిత్తూరు అర్బన్: దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్ రెడ్డి వీరాభిమాని, వైసీపీ నాయకురాలు పోంగోడి తండ్రిగారి ఆస్తిని ఆ పార్టీ స్థానిక నాయకులు దౌర్జన్యంగా లాక్కుంటున్నారని సోమవారం కలెక్టరేట్ ఎదుట పోంగోడి కుటుంబ సభ్యులు నిరసన తెలిపి, అనంతరం జాయింట్ కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా బాధితురాలు పుంగోడి మాట్లాడుతూ తన తండ్రి పేరిట స్థానిక రామ్ నగర్ కాలనీలో ఉన్న భూమిని స్థానిక వైసీపీ నాయకులు దౌర్జన్యంగా లాక్కోవాలని ప్రయత్నిస్తున్నారని, తాను పార్టీకి అహర్నిశలు పనిచేస్తున్నట్లు తెలిపారు. తమ భూమిని అక్రమంగా లాక్కోవాలని చూస్తున్న వారిపై చర్యలు తీసుకురావాలని కోరారు. పూర్వీకుల నుండి లభించిన తమ స్థలానికి సంబంధించిన అన్ని డాక్యుమెంట్లు తమ వద్ద ఉన్నట్లు తెలిపారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

ఉపాధ్యాయులకు సన్మానం చేస్తున్న పూర్వ విద్యార్థులు

ప్రజాశక్తి-యాదమరి: స్థానిక ఉన్నత పాఠశాలలో 1979 వ సంవత్సరం పదవ తరగతి చదివిన పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమావేశం సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యను బోధించిన అప్పటి ఉపాధ్యాయులు నాగరాజు పిళ్ళై, సుబ్రహ్మణ్యం లను పూర్వ విద్యార్థులు సన్మానించారు. ఈ కార్యక్రమానికి పూర్వ విద్యార్థులు లండన్‌లో డాక్టర్‌గా పనిచేస్తున్న వేంకటేశులు రెడ్డి, యాదమరి గ్రామీణ బ్యాంకు రిటైర్డ్ మేనేజర్ సుబ్రమణ్యం, సాయినాథ రెడ్డి, రవి ముదలి, శంకర్ శెట్టి, జ్యోతీశ్వర్, పెరుమాళ్ళ పల్లెకు చెందిన జ్యోతమ్మ, రిటైర్డ్ టీచర్ వసంతమ్మ, తదితరులు 40 మంది పూర్వ విద్యార్థులతో పాటు వారి కుటుంబ సభ్యులు హాజరయ్యారు. అప్పటి ఉపాధ్యాయులు నాగరాజు పిళ్ళై మాట్లాడుతూ అప్పట్లో హెచ్ఎం సుబ్రమణ్యం రెడ్డి, ఉపాధ్యాయులు, విద్యార్థులకు నేర్పిన క్రమశిక్షణ కారణంగా ఎంతో మంది ఉన్నత చదువులు చదివి, అత్యున్నత పదవులు చేపట్టారని చెప్పి, పూర్వ విద్యార్థులు ఆయురారోగ్యాలు, సుఖసంతోషాలతో ఉండాలని దీవించారు.

ఇసుక మాఫియా నుంచి కాపాడాలి



నానికి పూలమాలవేసి మద్దతు తెలుపుతున్న వెదురుకుప్పం నాయకులు

ప్రజాశక్తి-వెదురుకుప్పం: చంద్రగిరిలో ఆమరణ నిరాహార దీక్ష చేస్తున్న జిల్లా తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు, చంద్రగిరి ఎమ్మెల్యే అభ్యర్థి పులివర్తి నానికి వెదురు కుప్పం నాయకులు మద్దతు తెలిపారు. సోమవారం వెదురుకుప్పం క్లస్టర్ ఇన్‌ఛార్జ్, టిడిపి జిల్లా మాజీ కార్యదర్శి పి.మోహన్ మురళి చంద్రగిరికి వెళ్లి నానిని పలకరించి, పూలమాలవేసి తన మద్దతును తెలిపారు. కార్యక్రమంలో ఆయన వెంట ఎస్సీ సెల్ అధ్యక్షుడు వరప్రసాద్ ఉన్నారు.

అగ్నిహోత్రిగా ద్రౌపదీదేవి

ప్రజాశక్తి-నగరి: మునిసిపల్ పరిధిలోని చింతలపట్టెడలో ప్రతి ఏడాది వైభవంగా నిర్వహించే ద్రౌపతీ తిరనాళ్లలో భాగంగా సోమవారం ద్రౌపతీ దేవికి అగ్నిహోత్రి అలంకారం చేశారు. అఖిలో భుడనే రాక్షసుని సంహరించడానికి ద్రౌపతీ దేవి అగ్ని నుంచి అవతరించిందని ప్రతీతి. అగ్ని నుంచి ఉద్భవించినందుకు ప్రతీకగా ఆమెకు అగ్నిహోత్రి అలంకారం చేశారు. అమ్మవారి విగ్రహం చుట్టూ పెద్ద ఎత్తున దీపాలు వెలిగించారు. అలంకరణ భక్తులను అమితంగా ఆకట్టుకుంది. ఆలయం వద్ద నిర్వహించిన మహాభారత పారాయణంలోనూ భాగవతారిని అగ్ని కుండలను పట్టుకొని పారాయణం చేయడం ప్రత్యేకతను సంతరించుకుంది. ఈ వేడుకలను చూడటానికి భక్తులు ఆలయం వద్ద అధిక సంఖ్యలో బారులు తీరారు. ఏర్పాట్లను ఉత్సవ నిర్వాహకులు నటరాజన్ పర్యవేక్షించారు.

ప్రజలే బుద్ధి చెప్పాలి



మైనార్టీ విద్యార్థుల సమస్యలను తెలుసుకుంటున్న మాజీ మంత్రి

ప్రజాశక్తి-వి.కోట: ఎన్నో సంవత్సరాలు కష్టపడి సాధించిన వి.కోట బైపాస్ రోడ్డును స్వార్థ ప్రయోజనాలకు కర్ణాటక రాష్ట్రానికి మళ్లించిన ద్రోహులను ప్రజలే శిక్షించాలని, అలైన్మెంట్ మార్పుపై సిబిఐ విచారణ జరిపించాలని రాష్ట్ర మాజీ మంత్రి అమర్‌నాథ్ రెడ్డి డిమాండ్ చేశారు. సోమవారం ఇంటింటికీ తెలుగుదేశం పార్టీ కార్యక్రమంలో భాగంగా 4వ రోజు మండల పరిధిలోని ముధరందొడ్డి పంచాయతీ పరిధిలోని గ్రామాల్లో వారు విస్తృతంగా పర్యటించారు. ప్రజల నుండి ప్రధానంగా బైపాస్ రోడ్డు అంశం ప్రస్తావనకు రావడంతో వారు ఆ విషయంగా మాట్లాడుతూ దశాబ్ద కాలంగా తెలుగుదేశం ప్రభుత్వం వి.కోటకు బైపాస్ రోడ్డు సాధనే లక్ష్యంగా పోరాడి కేంద్రం నుండి రూ.116 కోట్ల నిధులను మంజూరు చేయించిందని తెలిపారు. నడిపేపల్లిలో మైనార్టీ విద్యార్థులు తమకు జూనియర్ కళాశాల లేనందున తాము ఉన్నత చదువులు చదువుకోలేకపోతున్నామని వారు దృష్టికి తీసుకొచ్చారు. కార్యక్రమంలో ఏఎంసీ మాజీ ఛైర్మన్ రామచంద్రనాయుడు, మండల పార్టీ అధ్యక్షుడు రంగనాథ్, పార్టీ ప్రధాన కార్యదర్శి ఈశ్వర్, మండల తెలుగు యువత అధ్యక్షుడు ధీరజ్, క్లస్టర్ ఇన్‌ఛార్జ్ రాంబాబు, విశ్వనాథ్, రఘు తదితరులు పాల్గొన్నారు.

ముద్ద చర్మవ్యాధి నిరోధక టీకాలు



ముద్ద చర్మవ్యాధిపై అవగాహన కల్పిస్తున్న ఏడీఏ

ప్రజాశక్తి-సోమల: మండలంలోని ఆవులు, గేదెలకు ముద్ద చర్మవ్యాధి సోకకుండా నిరోధించేందుకు ఆగస్టు 1వ తేదీ నుండి టీకాలను వేయనున్నట్లు సోమల ప్రాంతీయ పశువైద్యశాల సహాయ సంచాలకులు శ్రీనివాసులు నాయుడు తెలిపారు. ఈ సందర్భంగా సోమవారం ఆయన ప్రజాశక్తితో మాట్లాడుతూ పశువుల శరీరంపై పుండ్లు, బొబ్బలు, కాళ్లు వాపు వంటివి ముద్ద చర్మవ్యాధి లక్షణాలని జ్వరం రావచ్చని ఇది ముమ్మాటికీ అంటు వ్యాధి అని, దీనిని నివారించడానికి పశుసంవర్ధక వ్యాధి సూచనల మేరకు టీకాలు వేయించడం ఒకటే మార్గమని అన్నారు. ఈగలు, దోమల వలన ఈ వ్యాధి వ్యాప్తి చెందుతుందని టీకా వేయించినప్పుడు పాల దిగుబడి తగ్గుతుందని, మేత తినవని రైతులు అపోహ పడతారని అలాంటిదేమీ లేదని అపోహలు విడనాడి టీకాలు వేయించాలని కోరారు. పశువైద్య అధికారిణి చందనప్రియ పాల్గొన్నారు.